



మడకశిర కాదు.. సింహగిరి..!

పేరు మార్పుపై ఆశలు

● మంత్రుల కమిటీ ఏర్పాటుతో ఊపందుకున్న చర్చలు ● నియోజకవర్గంలో పలు గ్రామాల పేర్ల మార్పునకు ప్రతిపాదనలు?

మడకశిర పేరు కాల గర్భంలో కలిసి పోనుందా.. సింహగిరిగా మారనుందా.. అన్న చర్చలు జోరందుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పలు ఊర్ల పేర్ల మార్పునకు మంత్రుల కమిటీని నియమించడమే ఇందుకు కారణం. శతాబ్దాల క్రితం మడకశిరను సింహగిరిగా పిలిచేవారని, అదే పేరునే పునరుద్ధరిస్తారన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీని పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సింహగిరిగా మార్పు చేయాలని కోరుతున్నారు. నియోజకవర్గంలోని పదుల సంఖ్యలో గ్రామాల పేర్లు మారనున్నట్లు చర్చ సాగుతోంది. అందులో రొళ్ల మండలంలోని కాకి గ్రామం పేరు కూడా ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



సింహం ఆకారంలో ఉన్న మడకశిర కొండ



మడకశిర టౌన్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల పేర్ల మార్పు చేసేందుకు ఇటీవల మంత్రుల కమిటీని ఏర్పాటు చేయడంతో నియోజకవర్గంలో పలు గ్రామాల పేర్ల మార్పుపై చర్చ సాగుతోంది. పదేళ్ల క్రితం సైతం ఇలాగే చర్చలు వినిపించాయి. మడకశిర పేరును గతంలో సింహగిరిగా పిలిచేవారని తెలుస్తోంది. తర్వాత మడకలపల్లిగా కాలక్రమేణా మడకశిరగా రూపాంతరం చెందింది. అంతకు ముందున్న సింహగిరి పేరే బాగుంటుందని స్థానిక ప్రజలు.. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. మడకశిర నియోజకవర్గంలో పలు గొల్లహట్టిల పేర్లతోపాటు కాకి తదితర గ్రామాల పేర్లు మార్పు చేయాలని కోరుతున్నారు.

మడకశిర చరిత్ర

చోళరాజు కట్టించిన ఆలయంలో ఒక శాసనం ఉందని అంటున్నారు. మడకశిర ప్రాంతాన్ని మైసూరు శీర సామంతులు కట్టించారని చరిత్ర చెబుతోంది. విజయనగర రాజుల కాలంలో హీరుడయరు అనే రాజు కర్ణాటక రాష్ట్రం శిర, మడకశిరలో పలు కట్టడాలను నిర్మించారని పూర్వీకుల ద్వారా తెలుస్తోంది. బీజాపూర్ రాజుల దండయాత్రతో రాజ్యాన్ని కోల్పోయిన వీరికి అప్పట్లో ప్రత్యామ్నాయంగా రత్నగిరి, మడకశిర ప్రాంతాలను అప్పగించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. 1728 సంవత్సరంలో మడకశిర ప్రాంతం మరాఠీల చేతిలోకి వెళ్లగా అప్పట్లోనే కోట, మహల్ నిర్మించారు. మరాఠీ రాజు మురారీరావు తండ్రి సిద్దోజీరావు ఇక్కడ మరణించారనీ, మడకశిర తహసీల్దార్ కార్యాలయానికి తూర్పు వైపున ఉన్న సమాధి ఆయనదేనని చెబుతున్నారు. 1762లో హైదర్ అలీ ఆక్రమించుకున్నారు. తిరిగి రెండు సంవత్సరాలకే మురారీరావు మడకశిరను చేజిక్కించుకున్నారు. 1774లో హైదర్ అలీ ఆధీనంలోకి వెళ్లి 1799లో టిప్పు సుల్తాన్ స్వాధీనమైంది. టిప్పుసుల్తాన్ ఆంగ్లేయుల చేతిలో మరణించే వరకు ఈ ప్రాంతాన్ని పాలించారు. ఆ సమయంలో మడకశిరను మడకలపల్లిగా పేరు మార్చారు. దానిని ఆంగ్లేయులు.. మడకశిరగా మార్చినట్లు పూర్వీకులు అంటున్నారు. ప్రస్తుతం పేర్ల మార్పునకు రాష్ట్రం ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో మడకశిర పేరు మార్పు అంశం తెరపైకి వచ్చింది. సింహగిరిగా మార్చాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఈ ప్రతిపాదనను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 25 నుంచి 30 గ్రామాల పేర్లు మార్చవచ్చన్న చర్చ సాగుతోంది. అందులో ప్రధానంగా గొల్లహట్టు, కాకి, బ్యాడిగెర తదితర పేర్లు వినిపిస్తున్నాయి. మడకశిర కొండ సింహం ఆకారంలో ఉండడం ఒక విశేషం. దీంతో ఈ ప్రాంతాన్ని గతంలో సింహగిరిగా పిలుస్తుండేవారని తెలుస్తోంది.

మడకశిరను పూర్వం సింహగిరిగా పిలిచేవారు



మడకశిరను పూర్వం సింహగిరిగా పిలిచేవారు. కాలక్రమేణా పాలెగాళ్ల పాలనలో మడకలపల్లిగా, అనంతరం మడకశిరగా పేరు మారిపోయింది. మడకశిర పేరును సింహగిరిగా మారుస్తారన్న చర్చలు వినిపిస్తున్నాయి. ఇది సంతోషదాయకం. ఇదే విషయాన్ని ప్రజాప్రతినిధులకు సైతం విన్నవిస్తున్నాం.

- సన్నప్ప, చీపులేటి

పేరు మార్చితే సంతోషం

మడకశిర పేరు సింహగిరిగా మార్పు చేస్తున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. పేరు మార్చితే చలా సంతోషిస్తాం. చాలామంది ఇదే కోరుకుంటున్నారు.

- మల్లేశ్, సి.రంగాపురం



రోడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి, మారెమ్మగుడి, గువ్వలగుట్టపల్లి వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో నిర్మిస్తున్న రహదారులను నవంబరు మొదటివారంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి నుంచి కోడూరు వరకు 46.76 కిలోమీటర్ల నాలుగులేన్ల రహదారి విస్తరణ పనులు ఇప్పటి వరకు 72శాతం పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన పనులను సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లోపు పూర్తి చేయాలన్నారు. అలాగే పుట్టపర్తి బైపాస్‌రోడ్డు 15 కిలోమీటర్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం 50శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. జాతీయ రహదారులకు ఇరుపక్కల చెట్లు నాటి సంరక్షించాలని సూచించారు. ఆయన వెంట జాతీయ రహదారుల డీఈ గిడ్డయ్య, జేఈ కావ్య, కాంట్రాక్టర్లు భాస్కర్‌రెడ్డి, మాల్వియా ఉన్నారు.

హత్య.. ఆత్మహత్య..!

● దంపతుల జీవితం విషాదాంతం
● దిక్కులేనివారైన ఇద్దరు కుమారులు

(వివరాలు మెయిన్‌లో...)

కబ్జాను అడ్డుకున్న అధికారులు

చిలమత్తూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు తోపులో కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకునేందుకు యత్నించగా.. పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని కోడూరు తోపులో రోడ్డు విస్తరణలో భాగంగా పక్కనే కొంతకాలంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, టీ హోటళ్లను ఇటీవల జాతీయ రహదారుల అధికారులు తొలగించారు. దాంతో ఆయా దుకాణాలు, హోటళ్ల నిర్వాహకుల కన్ను పక్కనే కోదండరామస్వామి ఆలయ ఆవరణలో ఉన్న పంచాయతీకి చెందిన స్థలంపై పడింది. చెత్తతో సంపద కేంద్రం ప్రాంగణంలో మంగళవారం బండలు పాతుకుంటూ, ఎక్స్‌కవేటర్లతో చదునుచేసుకునేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి భాస్కర్, సర్పంచ్ మురళీమోహన్.. వారిని అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి, ఆక్రమణదారులను పంపించేశారు.

విలువైన స్థలాల ఆక్రమణ

బ్రిటిష్ కాలంలో ఈ ప్రాంతానికి కలెక్టర్‌గా పనిచేసిన థామస్ మన్రో ఏర్పాటుచేసిన మన్రో తోపు ఒకప్పుడు పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉండేది. ఇప్పుడు కబ్జా కోరల్లో చిక్కుకుంటోంది. ఆఖరుకు ఖఖమన్రో తోపు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. ఒక పక్క 44వ జాతీయ రహదారి, మరోపక్క నాలుగు లేన్ల రోడ్డు, అర కిలోమీటరు దూరంలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మిస్తుండడంతో కోడూరు తోపు ఐకాన్‌గా నిలుస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కొందరు పంచాయతీ ఆధీనంలో ఉన్న మన్రో తోపులోని భూమిని కబ్జా చేస్తున్నారు. గతంలో ఇదే తోపులో ఆక్రమణలకు పాల్పడి భవంతులను నిర్మించుకున్నారు. వాటిని లక్షలాది రూపాయలకు విక్రయించి, సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం మన్రో తోపులో సెంటు ధర లక్షల్లో పలుకుతుండటంతో కబ్జారాయుళ్ల కన్ను పడింది. చిరు వ్యాపారుల పేరుతో కొందరు బడా బాబులే ఈ కబ్జాలకు పాల్పడుతున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.



ఆక్రమణలను అడ్డుకుంటున్న అధికారులు

ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కానివ్వం

మన్రో తోపు ప్రభుత్వ భూమిలో ఉంది. ఇప్పటి వరకు పంచాయతీ ఆధీనంలో ఉంది. ఇటీవల రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారితోపాటు మరికొంత మంది కోదండ రామాలయం ప్రాంగణంలో ఆక్రమణలకు పాల్పడే ప్రయత్నం చేశారు. వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేశాం. ఎవరు ఆక్రమణలకు పాల్పడినా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిలో కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- భాస్కర్, కోడూరు పంచాయతీ కార్యదర్శి




ఎస్పీని సన్మానిస్తున్న పోలీసు అసోసియేషన్ సభ్యులు

పోలీసు సంక్షేమానికి కృషి

● ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. పోలీసులకు ఎలాంటి సమస్య ఉన్నా.. తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఉమ్మడి జిల్లా పోలీసు సంక్షేమ సంఘం సభ్యులు.. డీపీఓలో ఎస్పీని మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. పోలీసు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే సమావేశం ఏర్పాటుచేసి, పోలీసు సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూర్యకుమార్, ఉమ్మడి జిల్లా సభ్యులు త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, దాదాపీర్, సరోజమ్మ ఉన్నారు.

వేదమాతగా దుర్గాదేవి



లేపాక్షిలో గాయత్రీదేవి అలంకరణలో దుర్గాదేవి



గాయత్రీమాతగా పుట్టపర్తి సత్యమ్మ అమ్మవారు

లేపాక్షి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా రెండోరోజు మంగళవారం లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో దుర్గాదేవి.. వేదమాత గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకాలు చేశారు. గాయత్రీదేవిగా ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. జిల్లాలోని ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు.

కోనవిందు..!



6

ఆర్టీసీకి భయం లేదు



శాసనసభ వేదికగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను లేవనెత్తారు. విద్య, వైద్యానికి సంబంధించి తమ తమ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్టీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయించాలని ముక్తకంఠంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైద్య కళాశాలల విషయంలో వైసీపీ తీరును తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం చేసిన కక్షపూరిత చర్యల వల్ల నేటికీ అనేకమంది ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉన్నారని, ఆ తప్పులను సరిదిద్దాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సేవలు కొనసాగుతాయి

● సీఎం మాటగా చెబుతున్నాం
● ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల భరోసా
● మంత్రి లోకేశ్‌తో భేటీ.. ఆర్డీటీపై చర్చ

అనంతపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవలకు ఎటువంటి ఆటంకం ఉండబోదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటగా తాము చెబుతున్నామని ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు మంగళవారం స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఆయన కార్యాలయంలో మంత్రి సవిత, విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి కలిశారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ అంశంపై మంత్రి నారా లోకేశ్‌తో చర్చించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ విషయంలో జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారని, చాలామంది రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు నారా లోకేశ్ స్పందిస్తూ ఆర్డీటీని కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిపై కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని హామీ ఇచ్చారు. లోకేశ్‌ను కలిసిన అనంతరం మంత్రి సవిత, కాలవ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ ఆర్డీటీ సమస్య పరిష్కారానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జిల్లాకు ఆర్డీటీ అందిస్తున్న సేవలు అమూల్యమైనవన్నారు. అందుకే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా

(మిగతా 6లో...)



నారా లోకేశ్‌తో మంత్రి సవిత, ఎమ్మెల్యేలు

కంది కళకళ

ఏపుగా పెరిగిన పైరు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు


మరవకొమ్మ వద్ద కళకళలాడుతున్న కందిపంట

శింగనమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట ఆశాజనంగా ఉంది. సమయానికి వర్షాలు కురుస్తుండటం తో పైరు ఏపుగా పెరుగుతోంది. మండలంలో వర్షాధారం కింద ఈ ఏడాది సుమారు 3 వేల ఎకరాల్లో రైతులు కంది పంట సాగుచేశారు. గతంలో వేరుశనగ పంటలో కందిని అంతర పంటగా సాగు చేసేవారు. అయితే వేరుశనగలో నష్టాన్ని తట్టుకోలేక చాలా మంది రైతులు కందినే ప్రధాన పంటగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్నారు. దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉండటం, పంట నష్టం జరిగినప్పుడు వేరుశనగ కంటే కందికే ఎక్కువ ఇన్సూరెన్స్ వస్తుండటంతో గత నాలుగైదేళ్లుగా రైతులు ఈ పంట సాగుకే ఆసక్తి చూపుతున్నారు. కొంతమంది సొంత భూమిలోనే కాకుండా కౌలుకు తీసుకుని కూడా కంది పంట సాగు చేస్తున్నారు.

ఎప్పుడూ నష్టం రాలేదు: వడ్డే నెట్టికంటి, సి.బండమీదపల్లి



గత నాలుగు సంవత్సరాల నుంచి నాకు ఉన్న మూడు ఎకరాలలో కంది పంట సాగు చేస్తున్నా. మంచి దిగుబడులు వచ్చాయి. నా భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. కంది పంట సాగు చేసినప్పటి నుంచి నాకు ఎప్పుడూ నష్టం రాలేదు. ఈ ఏడాది 30 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. ప్రస్తుతం పంట పైరు ఆశాజనకంగా ఉంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉంటే రైతుకు మరింత లాభదాయకంగా ఉంటుంది.

లక్షల్లో లాభాలు: కాయల జయరాముడు, సి.బండమీదపల్లి



నేను మూడేళ్లుగా నా సొంత భూమితో పాటు కొర్రపాడు సమీపంలో మరో 35 ఎకరాలను కౌలుకు చేస్తున్నా. గత మూడు సంవత్సరాల నుంచి పెట్టుబడులు పోగా లాభాలు లక్షల్లో వచ్చాయి. ఈ సారి కూడా కంది పంటను సాగు చేశాం పంట బాగానే ఉంది. ఈపంటకు పెట్టుబడులు తక్కువ. పంట పూత, పిందె సమయంలో పురుగుమందులు పిచికారీ చేసి కాపాడుకుంటే చాలు మంచి దిగుబడులు వస్తాయి.

మంచి ధర ఉంది: అన్వేష్‌కుమార్, వ్యవసాయాధికారి



పంట మార్పిడిలో భాగంగా ఎక్కువ మంది రైతులు కంది పంటను సాగు చేశారు. ఈపంటకు పూత, పిందె దశలో మాత్రం తెగుళ్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు సలహాలతో సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి. గత నాలుగు సంవత్సరాల నుంచి మార్కెట్‌లో కందులకు మంచి గిట్టుబాటు ధర ఉంది.

మాతృమూర్తికి వందనం

● తల్లిపాలదాత లిఖితను సన్మానించిన తల్లులు


తల్లిపాల దాత దర్శి లిఖితను సన్మానిస్తున్న తల్లులు, మిల్క్‌బ్యాంక్ పర్యవేక్షకులు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలకు పాలు దానం చేసిన మీరే అసలైన మాతృమూర్తి అని దర్శి లిఖితను పలువురు తల్లులు సన్మానించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అనంత మదర్ మిల్క్ బ్యాంక్ కేంద్రంలో లిఖితకు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్ మిల్క్ బ్యాంక్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ హేమలత మాట్లాడుతూ నగరానికి చెందిన దర్శి లిఖిత బెంగళూరు ఎయిర్ పోర్టులో ఎలక్ట్రికల్ మేనేజర్‌గా పని చేస్తున్నారన్నారు. ఏప్రిల్ 30న బిడ్డకు జన్మనిచ్చిన ఆమె ఇప్పటి వరకు 45 నుంచి 50లీటర్ల తల్లి పాలను దానం చేశారన్నారు. లిఖితకు ప్రసూతి సెలవులు ముగియడంతో తిరిగి ఆమె విధుల్లోకి వెళ్తున్న సందర్భంగా సన్మాన సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షబానా అనే విద్యార్థి తన పాకెట్ మనీతో ఫీడింగ్ బాటిల్స్‌ను దానం చేసిందని ప్రశంసించారు. కార్యక్రమంలో మిల్క్‌బ్యాంక్ నోడల్ ఆఫీసర్ భాస్కర్ నాయక్, న్యూట్రిషనిస్ట్ పల్లవి, కౌన్సిలర్ రాధ, స్టాఫ్‌నర్స్ రమ, కృష్ణ, శిశువుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పీడితులకు వైద్యం చేయాలి

● కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారందరికీ వైద్యం అందించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిని గుర్తించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. గుర్తించిన వారందరినీ ఏఆర్‌టీ కేంద్రాల్లో నమోదయ్యేలా చూసి, చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, జడ్పీ సీఈఓ శివశంకర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి జయలక్ష్మి, డీపీఓ నాగరాజునాయుడు, ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్ ఎల్లప్ప పాల్గొన్నారు.

కోనవిందు..!

దగ్గరలో పర్యాటక క్షేత్రం


ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు



కనువిందు చేస్తున్న కోన జలపాతం

దసరా సెలవులు వచ్చాయి. ఎక్కువ దూరం వెళ్లకుండా.. ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఆహ్లాదరక వాతావరణంలో ఒక్క రోజు గడిపేందుకు చాలా ప్రాంతాలు ఉన్నాయి. అలాంటి వాటిలో ఒకటి.. యాడికి మండలంలోని కోన రామలింగేశ్వర స్వామి క్షేత్రం. వర్షాకాలంలో జీవం పోసుకునే జలపాతం ఇక్కడి విశేషం. ఇప్పుడు జలజలా దూకి.. గలగల పారుతోంది. కోన చెరువు, కోనేరు, ఎకరం విస్తీర్ణంలో ఉన్న మర్రిచెట్టు.. దానికి వేలాడే ఊడలు, చుట్టూ పచ్చదనం.. అన్నీ కనువిందు చేస్తాయి. పెద్దగా వెలుగులోకి రాని కోన గుహలు కూడా ఈ ప్రాంతంలో చూడదగ్గ ప్రదేశం. దగ్గరికి వెళ్లేదారా అక్కడ ఓ గుహ ఉన్నట్లే తెలియదు. కాస్త ధైర్యం చేసి లోపలికి వెళ్లితే.. కొంత దూరం వరకూ సెల్ ఫోన్ టార్చ్ వెలుగులలో అందాలను, ఆ లోపల చిన్నపాటి సెలయేటినీ చూడొచ్చు. క్షేత్రంలో కోన రామలింగేశ్వరుడిని దర్శించుకుని, ఉదయం నుంచి సాయంత్రం వరకూ హాయిగా గడపొచ్చు. యాడికి పట్టణం నుంచి 15 కి.మీ. దూరంలో ఉంటుంది ఈ ప్రాంతం. కానీ వాహన సౌకర్యం లేదు. యాడికి వరకూ బస్సులో వెళ్లొచ్చు. అక్కడి నుంచి సొంత వాహనం, లేదా అద్దె వాహనం ఏర్పాటు చేసుకోవాల్సిందే. వెంట తినడానికి ఏదో ఒకటి తీసుకెళ్లడం మరిచిపోవద్దు. ఆ నీటిలో ఆడుకుని, ప్రకృతి అందాలను తిలకిస్తూ.. పరవశించి పోయాక.. ఆకలి వేస్తుంది. అక్కడ ఏమీ దొరకదు. దగ్గరలో కోన ఉప్పలపాడు గ్రామం ఉంది. కానీ పల్లెటూరు. చిన్న చిన్న దుకాణాలు మాత్రమే ఉంటాయి. ఇంటిల్లిపాదీ వెళితే.. అక్కడే వంట చేసుకుని తినేందుకూ వీలుంది.

-ఆంధ్రజ్యోతి, యాడికి


కోన రామలింగేశ్వర స్వామి


కోన గుహల ప్రవేశ ద్వారం


కోన రామలింగేశ్వరస్వామి ఆలయం ముంగిట కొండల పైనుంచి వస్తున్న నీరు


అబ్బురపరిచే ఊడల మర్రి


ఆహ్లాదపరిచే కోన చెరువు


ఆలయం వద్ద కోనేటిలోకి పారుతున్న జలపాతం నీరు

ఆర్డీటీకి భయం లేదు

(5వ పేజీ తరువాయి)

తీసుకుందన్నారు. ఎమ్మెల్యే దగ్గుబాటి మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థని అడ్డుపెట్టుకొని వైసీపీ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ సేవ్ అనంతపురం, సేవ్ ఆర్డీటీ నినాదంతో జిల్లా ఎమ్మెల్యేలంతా ఏకతాటిపై ఉన్నామన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయించే బాధ్యత తమపై ఉందన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్య, వైద్యాన్ని పేదలకు అందిస్తున్న ఆర్డీటీని ప్రజాప్రతినిధులమంతా ఐక్యమత్యంతో కాపాడుకుంటామన్నారు. వైసీపీ నేతలు రాజకీయ ఉనికి కోసమే ఆర్డీటీ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ గత 56 సంవత్సరాలుగా ఆర్డీటీ అనేక సేవ కార్యక్రమాలు చేస్తోందన్నారు. పేదలకు గృహ నిర్మాణం, విద్య, వైద్యం ఉచితంగా అందిస్తోందన్నారు. రైతులకు పండ్ల మొక్కలు అందజేస్తూ హార్టికల్చర్ అభివృద్ధికి పాటుపడుతోందని వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4వేల గ్రామాల్లో ఎంతో మందికి ఆర్డీటీ సేవలు అందిస్తోందన్నారు. అలాగే 30 సంవత్సరాల పోరాటం అనంతరం చంద్రబాబు చేతుల మీదుగా ఎస్సీ వర్గీకరణ జరగడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు ఇప్పటికే కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు.

శాపంగా వైసీపీ కక్షపూరిత చర్యలు

● ఎమ్మెల్యే పరిటాల సునీత



వైసీపీ పాలనలో అనుసరించిన కక్షపూరిత చర్యలతో నేటికీ అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆవేదన వ్యక్తం చేశారు. తప్పులను సరిచేసి, అర్హులందరికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆమె జీరో అవర్‌లో మాట్లాడారు. కొత్తగా ఇస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో కక్షపూరితంగా టీడీపీ సానుభూతిపరుల రేషన్‌కార్డులు, పెన్షన్లు తొలగించారన్నారు. ప్రభుత్వ పథకాలన్నింటికి రేషన్‌కార్డులు ప్రామాణికం కావడం వల్ల చాలా మందికి లబ్ధి చేకూరలేదన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విషయంలో గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు, గ్రామ వలంటీర్లు చేసిన పొరపాట్ల వల్ల అనేక సమస్యలు వచ్చాయన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు సరిగ్గా నమోదు కాకపోవడం, ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు తల్లిదండ్రులతో కాకుండా వేరుగా ఉన్నా అవి నమోదు చేయకపోవడం, విద్యుత్ బిల్లులు ఎక్కువగా చూపి వాటిని సరిచేయకపోవడం వంటివి జరిగాయన్నారు. వాటన్నింటిని తక్షణమే సరి చేయాలని కోరారు.

వైద్య విద్య పాపం వైసీపీదే: కాలవ



అనంతపురం క్రైం/రాయదుర్గం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉచితంగా అందాల్సిన వైద్యవిద్యను ఖరీదైనదిగా మార్చిన పాపం గత వైసీపీ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన వైద్యరంగంపై మాట్లాడారు. పేదలకు అందాల్సిన సీట్లను ఎన్నారై, ఇతర కోటా పేరుతో రూ.20 లక్షలు, రూ.12 లక్షలకు పెంచినది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభించినట్లు గొప్పలు చెబుతున్నారని, అయితే నేటికీ పునాది, మొండి గోడలకే పరిమితమైన వాటిని చూసి వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలల ఫొటోలు అసెంబ్లీలో చూపుతూ వైసీపీ తీరును ఎండగట్టారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, అన్ని రంగాల్లో విధ్వంసం సృష్టించారంటూ ఫైర్ అయ్యారు. ఉమ్మడి ఏపీలో సీఎం చంద్రబాబు 17 మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తే... అందులో ఆరు ప్రభుత్వ రంగంలోనే ఉన్నాయన్నారు. అత్యంత వెనుకబడిన అనంతపురంలో సైతం 2000 సంవత్సరంలో వైద్యకళాశాలను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఏ ఒక్కటీ ప్రారంభించలేదని మండిపడ్డారు. అలాగే రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో 22మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఆరుగురే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో వంద పడకల ఆసుపత్రిగా దీనిని మార్చారని తెలిపారు. అందుకు అనుగుణంగా అదనపు భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేసి, వైద్యులను నియమించాలని కోరారు.

బాబా జయంతికి ప్రత్యేక నిధులు ఇవ్వండి

ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



పుట్టపర్తి రూరల్: ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రభుత్వాన్ని మంగళవారం కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ కోట్లాది మంది ఆరాధించే సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు నవంబరులో ప్రారంభమవుతాయని, అందుకు సంబంధించి ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరుచేయాలని విన్నవించారు. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్రపండుగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీఓ జారీ చేసినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జయంతి ఉత్సవాలకు దేశప్రధాని నరేంద్రమోదీతో పాటు దేశవిదేశాల నుంచి ప్రముఖులు రానున్నట్లు వెల్లడించారు. విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, పట్టణ సుందరీకరణ కోసం ఇప్పటికే ప్రభుత్వానికి రూ.105 కోట్లతో డీపీఆర్ పంపినట్లు పేర్కొన్నారు.

నేడే అమరావతికి.. కొత్త టీచర్ల పయనం

ఉదయం పీవీకేకే కళాశాల నుంచి బయల్దేరనున్న బస్సులు

ఏర్పాట్లు పూర్తిచేసిన విద్యాశాఖాధికారులు


ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

అనంతపురం విద్య సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో టీచర్ పోస్టులు సాధించిన వారు బుధవారం అమరావతికి వెళ్లనున్నారు. మెగా డీఎస్సీ సభలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్నారు. ఈనెల 19వ తేదీనే వెళ్లాలని ఏర్పాట్లు చేయగా.. వర్షాల కారణంగా వాయిదా పడింది. ఈనెల 25న అమరావతిలో మెగా డీఎస్సీ సభ నిర్వహణకు ముహూర్తం ఖరారు చేశారు. టీచర్ ఉద్యోగాలు సాధించిన వారందరినీ తీసుకురావాలని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు పంపారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేపట్టింది. డీఎస్సీలో ఎంపికైన టీచర్లు, పీజీటీ, టీజీటీలతోపాటు ఒక్కో అభ్యర్థి వెంట మరొకరు తప్పనిసరిగా ఉండాలని నిబంధన విధించారు. పర్యవేక్షణకు ప్రతి బస్సులో ముగ్గురిని ఏర్పాటు చేశారు. ఈలెక్కన మొత్తం 2,100 మంది జిల్లా నుంచి అమరావతికి వెళ్తారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. వీరికోసం 45 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం ఉదయం 7గంటలకు అనంతపురంలోని ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే కళాశాల నుంచి బస్సులు బయల్దేరుతాయన్నారు. అభ్యర్థులు 6 గంటలకే కళాశాలకు చేరుకోవాలని డీఈఓ ప్రసాద్ బాబు కోరారు.

గుడి డబ్బు కోసం గొడవ

● గ్రామసభ వాయిదా


సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

శింగనమల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుడి డబ్బు కోసం ఊరి జనం గొడవ పడ్డారు. మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన వీరబ్రహ్మం స్వామి దేవాలయం నాయనపల్లి క్రాస్‌లో ఉండేది. ఎన్ఎస్ 544 విస్తరణలో గుడి పోయింది. అందుకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. పెరవలి గ్రామానికి చెందిన వారు మొదట ఒక ఆలయ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. విభేదాలు రావడంతో మరో కమిటీ వేసుకున్నారు. గుడికి సంబంధించిన పరిహారం సొమ్ము రూ.60లక్షలుపైగా ఒక కమిటీ పేరున జమ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మరో కమిటీ సభ్యులు.. కలెక్టర్, ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేయడంతో గుడి డబ్బు విషయంలో మరోసారి గ్రామంలో సభ నిర్వహించాలని సూచించారు. ఆ మేరకు ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ శేషారెడ్డి, సీఐ కౌలుట్లయ్య కలిసి పెరవలి సచివాలయంలో మంగళవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. రెండు కమిటీల సభ్యులు వాగ్వాదం చేసుకున్నారు. దీంతో అధికారులు గ్రామసభను వాయిదా వేశారు. ఇరు కమిటీలు ఏకాభిప్రాయానికి వస్తేనే ప్రభుత్వం సొమ్ము జమ చేస్తుందనీ, లేదంటే రాదని ఆర్డీఓ కేశవనాయుడు స్పష్టం చేశారు.


కూర్మావతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

కూర్మావతారంలో శ్రీవారు

కదిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు మంగళవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం కూర్మావతారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసురెడ్డి, భక్తులు, ఉభయదారులు పాల్గొన్నారు.

బధిరులను ప్రోత్సహించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బధిరులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బధిరులు, సైన్ లాంగ్వేజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ అధ్యక్షుడు గడుపూటి నారాయణస్వామి హాజరయ్యారు. బధిరులు మనోధైర్యంతో ముందుకు సాగుతూ.. అన్ని రంగాల్లో విజయం సాధించాలన్నారు. బధిరుల ఉన్నతికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. అలిమ్కో ద్వారా జిల్లాలో 948 మందిని శ్రవణ యంత్రాలైన ల్యాప్‌టాప్, టచ్‌ఫోన్లకు ఎంపిక చేశామని, త్వరలోనే వాటిని పంపిణీ చేస్తామన్నారు. గడుపూటి నారాయణస్వామి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం.. బధిరులకు అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. ఏపీ విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ద్వారా బధిరులకు అవసరమైన సేవలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అర్చన, సమగ్రశిక్ష పీడీ శైలజ, ఆర్డీటీ ప్రతినిధి రఫీ పాల్గొన్నారు.

ఘనంగా ఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

ధర్మవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే ప్రయాణికులకు రైల్వే భద్రత గురించి అవగాహన కల్పించారు. సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైల్వేశాఖకు సంబంధించిన ఆస్తులపై ఎవరు దాడులు చేయరాదని, అలా చేస్తే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. రైల్వేలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘాను ఉంచినట్లు తెలిపారు. ప్రయాణికులు అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెట్టుకోవడం వల్ల దొంగతనాలు, మోసాలు జరిగే అవకాశం ఉందన్నారు. అనంతరం గొట్లూరు అనాథాశ్రమంలో బ్రెడ్లు పంపిణీ, చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ కోటేశ్వరరావు, ఏఎస్ఐ పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ ఎస్ఈ బదిలీ


బాధ్యతలు చేపడుతున్న సుధాకర్ రెడ్డి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) హరిప్రసాద్‌బాబు బదిలీ అయ్యారు. ఇయనను ఎయిర్‌పోర్టుల అభివృద్ధి సంస్థ లిమిటేడ్ (ఏపీఏడీసీఎల్) చీఫ్ జనరల్ మేనేజర్‌గా డెప్యుటేషన్‌పై బదిలీ చేశారు. అయన స్థానంలో ఇన్‌చార్జి ఎస్ఈగా ఈఈ సుధాకర్‌రెడ్డిని నియమించారు. దీంతో మంగళవారం ఎన్‌హెచ్ ఎస్ఈ హరిప్రసాద్‌బాబు రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జి ఎస్ఈగా సుధాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

అక్రమాలు తేలేనా..?

జడ్పీలో ఏజీ ఆడిట్ టీమ్.. పదిరోజులపాటు మకాం

నెలరోజులు అనుబంధ శాఖల్లో ఆడిటింగ్

పలు శాఖల్లో అధికారులను సంప్రదించిన బృందం


డీపీఓ కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న ఆడిట్ టీమ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జడ్పీ కార్యాలయంలో ఏజీ ఆడిట్ టీమ్ మకాం వేసింది. ముగ్గురు అధికారులతో కూడిన బృందం ఆడిట్ ప్రక్రియ మొదలు పెట్టింది. 2019 - 2020 నుంచి 2024-2025 ఆర్థిక సంవత్సరం వరకు పలు పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల వివరాలు పరిశీలిస్తున్నారు. వాటిలో ఏవైనా పొరపాట్లు ఉంటే అందుకు అనుగుణంగా నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందించనున్నారు. జడ్పీలోనే పది రోజులు ఉండి క్షుణంగా పరిశీలించనున్నారు. అనంతరం మరో నెల పాటు అనుబంధ శాఖలకు సంబంధించి ఆడిట్ నిర్వహించనున్నారు. బృందంలోని ఒక్కొక్కరు జడ్పీ సిబ్బందిని వెంటబెట్టుకొని మంగళవారం జిల్లా ఆడిట్ విభాగం సిబ్బందిని కలిసి, సంబంధిత రికార్డులు సిద్ధం చేయాలని ఆదేశించారు. అక్కడి నుంచి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి పనులకు సంబంధించి సెస్ చెల్లింపుల రికార్డులు సిద్ధం చేయాలని సూచించినట్లు తెలిసింది. జిల్లా పంచాయతీ కార్యాలయానికి చేరుకుని అక్కడ అధికారులకు సంబంధించి పలు రికార్డులు సిద్ధం చేయాలని సూచించారు. అక్కడి నుంచి మైనింగ్ తదితర విభాగాలను కూడా సంప్రదించి రికార్డులు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ అంటేనే అక్రమాలకు నిలయం అన్న ప్రచారం ఉంది. రెగ్యులర్ సీఈఓ, డిప్యూటీ సీఈఓలు లేకపోవడంతో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. కింది స్థాయి సిబ్బందికి ఎవరి వాటాలు వారికి ముట్టచెప్పి పెద్దఎత్తున ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. అధికారుల అక్రమాలను పాలకులు సీరియస్‌గా తీసుకోకపోవడంతో వారు అడ్డు, అదుపులేకుండా ఎక్కడి సొమ్ము అక్కడ దిగమింగేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డీఎల్‌డీఓగా ఉన్న ఓ మహిళా అధికారికి ఇన్‌చార్జ్ సీఈఓ బాధ్యతలు కట్టబెట్టడంతో బినామి పేర్లతో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ప్రచారం జరుగుతోంది. వీటిపై పెద్ద ఎత్తున ప్రభుత్వానికి పిర్యాదులు కూడా వెళ్లాయి. ప్రస్తుతం ఏజీ ఆడిట్‌కు రావడంతో ఉద్యోగుల్లో బదిలీ అయినా సరే తీవ్ర ఆందోళన నెలకొంది. ఏజీ ఆడిట్ టీమ్‌ను కూడ మ్యానేజ్ చేసి ఘనులు జడ్పీలో ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది.

ఊరెళ్తున్నారా..? ఇల్లు జాగ్రత్త..!

పిల్లలను బాగా చదివించాలని, గొప్పవారిగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులు కలలు కంటారు. అందుకోసం రెక్కలు ముక్కలు చేసుకుంటారు. రూపాయి.. రూపాయి.. కూడబెడతారు. అది ధనం కాదు.. జీవితం, భవిష్యత్తు అన్నీ. అలాంటి అమూల్యమైన సొమ్మును నిర్లక్ష్యం చేస్తున్నారు. పండుగకు ఊరెళ్లాలన్న సంతోషంతో సొమ్ము, నగలను ఇంట్లోనే పెట్టేస్తున్నారు. దొంగల చేతికి ఇల్లు అప్పగిస్తున్నారు. సెలవులు ఆనందంగా గడిపి తిరిగొచ్చాక లూటీ అయిన ఇంటిని చూసి గొల్లుమంటున్నారు. ఒక్క క్షణం ఆలోచించాలి. జీవిత కాల కష్టాన్ని కాపాడుకునేందుకు పోలీసులకు ఒక్క మాట చెబితే చాలు. వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను ఏర్పాటు చేస్తారు. తెలియనివారు ఎవరు ఆ ఇంట్లోకి చొరబడినా.. ఇట్టే పట్టేస్తారు.

దసరా సెలవుల్లో చోరీలు జరిగే ప్రమాదం

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ఇంటికి అభయం

సేవలను వినియోగించుకోవాలని పోలీసుల సూచన

ధర్మవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. దీంతో చాలామంది పిల్లలను తీసుకుని ఇల్లు విడిచి స్వగ్రామాలు, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా వీటికి అడ్డుకట్ట వేసి, ఇంటికి రక్షణ కల్పించుకోవచ్చునని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

LHMS AP Police

వెరీ ఈజీ..

ప్రతి ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లో సులభంగా ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌ను సెల్‌ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఊరు వెళ్లేటపుడు పోలీసు గస్తీ అవసరమని భావిస్తే రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ఆప్షన్‌ను క్లిక్ చేసి సెల్‌ఫోన్ ఐడీని పూరించాలి. ఏ రోజు ఊరు వెళ్తున్నారో ఆ తేదీతోపాటు తిరిగి వచ్చే తేదీని తెలియజేస్తే కంట్రోల్ రూంకు సమాచారం చేరిపోతుంది. అలారంలో ఈ కెమెరా లింక్ అయ్యి ఉండటంతో ఎలాంటి కదలిక ఉన్నా కంట్రోల్ రూం, స్థానిక పోలీసు స్టేషన్‌కు వెంటనే సమాచారం వస్తుంది. దీంతో పోలీసులు తక్షణం అప్రమత్తమవుతారు. దూర ప్రాంతాలకు వెళ్లేటపుడు పరిసరాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇంటి ద్వారాలకు అలారం ఏర్పాటు చేసుకుంటే దొంగలు తలుపులు తెరిస్తే అవి ఎక్కువ శబ్దం చేస్తాయి.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోండి



దసరా సెలవులకు ఊరెళ్లేవారు తప్పకుండా ఎల్ హెచ్ ఎం ఎస్‌ను వినియోగించుకోవాలి. యాప్‌లో సమాచారం ఇస్తే చాలు.. ఆ ఇంటిపై నిఘా పెడతాం. చోరీలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రతిఒక్కరూ బాధ్యతగా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి.

-హేమంత్ కుమార్, డీఎస్పీ, ధర్మవరం

ఆప్కో వస్త్రాలపై 40శాతం డిస్కౌంట్

● వాణిజ్య అధికారి వరప్రసాద్


తగ్గింపు ధరలకు పట్టుచీరలను విక్రయిస్తున్న సిబ్బంది

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆప్కో వస్త్రాలపై 40శాతం డిస్కౌంట్(తగ్గింపు) ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి వరప్రసాద్ మంగళవారం తెలిపారు. వినియోగదారుల అభిరుచి మేరకు ఉప్పాడ, జాంధాని, వెంకటగిరి, మంగళగిరి, కోడుమూరు, మదనపల్లి, బందరు, రాజమండ్రి, మాధవరం తదితర పట్టు, కాటన్ చీరలు ఆప్కో విక్రయశాలల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. డ్రెస్ మెటీరియల్స్, బెడ్‌షీట్స్, లుంగీలు, షర్టింగ్, సిల్క్ అండ్ కాటన్ ధోవతులు విక్రయిస్తున్నట్లు తెలిపారు. విక్రయశాలలను సందర్శించి నచ్చిన వస్త్రాలను కొనుగోలుచేసి 40శాతం తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిస్కౌంట్ ఇస్తున్న ఆప్కో విక్రయశాలల వివరాలు...

ఆప్కో విక్రయశాల	నంబర్
పోలీస్ వెల్ఫేర్, అనంతపురం	08554- 249475
క్లాక్‌టవర్ నేతబజార్, అనంతపురం	08554- 245465, 9849993040
సప్తగిరి సర్కిల్, అనంతపురం	08554- 233777, 9515220570
కదిరి	08494- 220159, 9381436370
పుట్టపర్తి	08555- 288562, 9059963334
జయనగర్, బెంగళూరు	9949250327
ఎన్ఆర్ కాలనీ, బెంగళూరు	9989744913
మైసూరు	8106220556

చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయని తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 294 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు తెలిపారు.

సబ్సిడీతో జిప్సం, క్రిమిసంహారక మందులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా రైతులకు సబ్సిడీతో జిప్సం, 17 రకాల క్రిమిసంహారక మందులు పంపిణీ చేయనున్నట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ మంగళవారం తెలిపారు. 50 కేజీల జిప్సం పూర్తి ధర రూ.262 కాగా.. సబ్సిడీపోను రూ.187కి అందజేస్తామన్నారు. 17 రకాల క్రిమిసంహారక మందులను 50 శాతం వరకు సబ్సిడీతో ఇస్తామన్నారు. అవసరమున్న రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రైతు ఆత్మహత్య


సురేష్ (ఫైల్)

పెద్దవడుగూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన రైతు సురేష్(35) అప్పుల బాధతో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు, సురేష్ తన తండ్రికి చెందిన రెండు ఎకరాలకు తోడు మరో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశారు. పెట్టుబడి కోసం రెండేళ్లలో రూ.6.50 లక్షలు అప్పు చేశారు. పంట దిగుబడి సరిగా రాక వాటిని తీర్చలేకపోయారు. రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు గమనించి, పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి గ్యార్మీ మాసం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ముస్లింల ప్రధాన పండుగల్లో ఒకటైన గ్యార్మీ వేడుకలు బుధవారం ప్రాప్రారంభంకానున్నాయి. వేడుకలకు జిల్లావ్యాప్తంగా దర్గాలు ముస్తాబయ్యాయి. జిల్లాకేంద్రంలోని శ్రీనివాసనగర్‌లో గల షాహే గౌసే ఆజం ఆసార్ దర్గాలో బుధవారం నుంచి అక్టోబరు 4వతేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, కోశాధికారి అబ్దుల్ సమీ మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. అక్టోబరు 3వ తేదీన రాత్రి గంధం ఊరేగింపు, 4న సాయంత్రం 5 గంటలకు దస్తగిరి స్వామి పవిత్ర కేశదర్శనం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పీఎంశ్రీ స్కూళ్ల లేఅవుట్ రూపొందించండి

ఇంజనీర్లకు ఏపీసీ శైలజ ఆదేశం

అనంతపురం విద్య, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ స్కూళ్ల లేఅవుట్ తయారుచేసి పంపాలని ఇంజనీర్లకు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ఆదేశించారు. స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో మంగళవారం సివిల్ పనులు, పీఎంశ్రీ స్కూళ్లపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏపీసీ శైలజ మాట్లాడుతూ.. జిల్లాలో 44పీఎంశ్రీ స్కూళ్లు ఉన్నాయన్నారు. వాటి వివరాలతో ప్రత్యేక లేఅవుట్ తయారుచేసి, పంపాలన్నారు. పాఠశాలల్లో సివిల్ పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు.

పీజీ ప్రవేశాలు ప్రారంభం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు ప్రక్రియను మంగళవారం ప్రారంభించారు. కిర్మయి అనే విద్యార్థిని తొట్టతొలిగా బయో కెమిస్ట్రీ అడ్మిషన్ పొందారు. వీసీ అనిత.. అడ్మిషన్ పత్రాన్ని విద్యార్థినికి అందజేశారు. వీసీ మాట్లాడుతూ.. మూడురోజులపాటు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలకు మొదటి విడతలో 328 సీట్లు అలాట్ అయ్యాయన్నారు. మొదటి రోజు మంగళవారం కావడంతో 17 మంది మాత్రమే అడ్మిషన్ తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్ అంజనేయులు, వైస్‌ప్రిన్సిపాల్ మునినారాయణప్ప, ప్రొఫెసర్లు చిట్టాసురేష్, నరసింహన్, రమణ, శ్రీనివాసన్, శోభాలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాధవి పాల్గొన్నారు.

నిడిమామిడిలో రాజగురువు శాసనం

● గుర్తించిన చరిత్రకారుడు మైనాస్వామి


నిడిమామిడిలో 1438నాటి రాజగురువు శాసనాన్ని చూపుతున్న చరిత్రకారుడు మైనాస్వామి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిమామిడి వీరభద్రాలయం పక్కన ఉన్న శ్రీశైలజగద్గురు సంస్థానంలో 1438 నాటి శాసనం గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి మంగళవారం పేర్కొన్నారు. కాళయుక్తి సంవత్సరం శ్రావణమాసంలో శ్రీశైలజగద్గురు బసవరాజ మహాదేవ సజీవ సమాధిపై నాటి రాజగురువు చంద్రభూషణదేవ మహామండలాచార్య బసవన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు ఈ శాసనంలో రాశారన్నారు. ఇంగ్లీషు సంవత్సరం తేదీ ప్రకారం సంస్థానంలో నంది విగ్రహ ప్రతిష్ఠ 1438 ఆగస్టులో జరిగిందని మైనాస్వామి వివరించారు. చిన్నరాతిపలకపై తెలుగులో శాసనాన్ని రాయగా పై భాగంలో నంది శిల్పాన్ని సుందరంగా మలిచారన్నారు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి రెండో దేవరాయల (1424-1446) కాలంలో నిడిమామిడి సంస్థాన అధిపతి చంద్రభూషణదేవ మహాచార్య రాజగురువుగా పనిచేశారన్నారు. ఈయన నిడిమామిడి నుంచి పెనుకొండకు, అక్కడి నుంచి హంపికి వెళ్లి రాజగురువుగా వ్యవహరించినట్లు మైనాస్వామి పేర్కొన్నారు.

పనులు నాణ్యంగా ఉండాలి

పంచాయతీరాజ్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు


కత్రిమల వద్ద బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఎస్ఈ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యతాలోపాలకు తావులేకుండా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈ చిన్నసుబ్బరాయుడు.. సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో పీఆర్, పీఐయూ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతపురం నుంచి తాడిపత్రికి పోయే మార్గంలో సలకం చెరువు వద్ద రూ.6.32 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పెద్దవడుగూరు మండలంలో చిత్తూరు నుంచి పామిడి వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణంలో భాగంగా బ్రిడ్జిని పరిశీలించారు. అక్కడ నుంచి పామిడి మండలంలోని పెన్నా నది వద్ద కొత్తపల్లి నుంచి కత్రిమలకు వెళ్లే మార్గంలో రూ.10 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు మాట్లాడుతూ పనులను గడువులోపు వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పీఐయూ ఈఈ మల్లికార్జున, డీఈలు మురళి, నారాయణస్వామి, పాండురంగారెడ్డి తో పాటు స్థానిక సిబ్బంది కాంట్రాక్టర్లు ఉన్నారు.

ఉద్యాన ఉత్పత్తుల ధరలపై ఆరా


టమోటా మండీలో ధరలపై ఆరాతీస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలైన చీనీ, టమోటా ధరలపై ఉద్యాన, అగ్రివాచ్ సంస్థ ప్రతినిధులు ఆరాతీశారు. అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ ఉత్పత్తులను ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి, ఏడీ దేవానంద్, ఏపీఎంఐపీ ఏడీ ధనుంజయ, హెచ్ఓలు రత్నకుమార్, అగ్రివాచ్ సంస్థ ప్రతినిధి ముస్లిహిమయుద్దీన్ పరిశీలించారు. చీనీ ధరలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చీనీ టన్ను నాణ్యతను బట్టి రూ.10వేల నుంచి రూ.20వేలదాకా పలుకుతోందని వ్యాపారులు తెలిపారు. ఆ తర్వాత అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి టమోటా మండీలో ధరలపై ఆరాతీశారు. ప్రస్తుతం 15 కేజీల టమోటా బాక్సు రూ.250 నుంచి రూ.350దాకా పలుకుతోందని వ్యాపారులు తెలిపారు. ఉద్యాన ఉత్పత్తుల ధరలు ఒక్కసారి తగ్గడం, పెరగడంపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అగ్రి వాచ్ సంస్థకు బాధ్యతలు అప్పగించిందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి పేర్కొన్నారు. అందులో భాగంగానే జిల్లాలో చీనీ, టమోటా ఉత్పత్తుల ధరలపై సంస్థ ప్రతినిధులతో కలిసి ఆరాతీశామన్నారు. క్షేత్రస్థాయిలో మరింత లోతుగా సంస్థ ప్రతినిధులు ధరలపై అధ్యయం చేసి, నివేదికలు సమర్పిస్తారన్నారు.

టమోటా కిలో రూ.22

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మంగళవారం టమోటా కిలో రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.14 సరాసరి ధర రూ.17 విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు. మార్కెట్‌కు మూడు వేల టన్నుల టమోటాలు వచ్చినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

కలెక్టర్, ఎస్పీని కలిసిన విష్ణువర్ధన్‌రెడ్డి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్‌ను బీజేపీ జాతీయకౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వారి కార్యాలయాల్లో కలసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సత్యసాయి శత జయంతి వేడుకల నిర్వహణ, జిల్లాలోని శాంతిభద్రతల గురించి కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయనతో పాటు నాయకులు రొద్దం ఉత్తంరెడ్డి, పీడీ పార్థసారథి, సుదర్శన్, కత్తి రాజారెడ్డి, హరికృష్ణగౌడ్, జ్యోతిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సహకార సంఘాల అభివృద్ధికి నిధులివ్వండి'


కలెక్టర్‌ను కలిసిన సింగిల్ విండో అధ్యక్షుడు బాబయ్య

కొత్తచెరువు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సహకార సంఘాల అభివృద్ధికి నిధులు కేటాయించి రై తులను ఆదుకోవాలని కేశాపురం సింగిల్‌విండో అధ్యక్షు డు బాబయ్య మంగళవా రం కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కలిసి విన్నవించారు. కలెక్టర్‌గా శ్యాంప్రసాద్ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. దీంతో జనసేన పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ వత్తి చంద్రశేఖర్, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబయ్య స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి, పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

నేడు మెగా వైద్య శిబిరం

కొత్తచెరువు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో బుధవారం ఉదయం 10 గంటలకు మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అశ్వత్థకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వస్థ్ నారీ... సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, చిన్నారులకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అదేవిధంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామని డాక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్మార్టు కార్డుల పంపిణీలో నిరక్ష్యం వద్దు

గాండ్లపెంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్మార్టు రేషన్‌కార్డుల పంపిణీలో నిర్లక్ష్యం వహించవద్దని సీఎస్‌డీటీ వాణి రేషన్ డీలర్లకు సూచించారు. ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశం మాట్లాడారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి: ప్రిన్సిపాల్


కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

ధర్మవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ఆవరణంలో పిచ్చి మొక్కలను, చెత్తకుప్పలను తొలగించి శుభ్రం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

నల్లచెరువు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జీ ఎంపీడీఓగా రామక్రిష్ణ మంగవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న రఘునాథ్‌గుప్త డ్వామా కార్యాలయ ఏఓగా ఉద్యోగోన్నతి పొంది నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో నల్లచెరువులో ఏఓగా పనిచేస్తున్న రామక్రిష్ణకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. ఆయనను ఎంపీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ బాబు, కంప్యూటర్ ఆపరేటర్ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇలా వచ్చారు... అలా వెళ్లారు

● ఒకటిన్నర గంటలో శిక్షణ తరగతుల ముగింపు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచక వర్షన్ 1.0పై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను అధికారుల ఆదేశాల మేరకు ఉదయం 10నుంచి సాయంత్రం 5వరకు నిర్వహించాల్సి ఉంది. ఉదయం 11గంటలకు ప్రారంభమైన శిక్షణ మధ్యాహ్నం 12.30గంటలకే ముగిసింది. దీంతో చూసిన ప్రతి ఒకరు శిక్షణకు ఇలా వచ్చి అలా వెళ్లడం ఏమిటంటూ చర్చించుకుంటున్నారు. ఒకరోజు శిక్షణలో ఎంపీటీసీ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యర్శులకు మండలస్థాయి అధికారులు, తొమ్మిది అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి, ఈఓఆర్డీ అంజినప్ప, ఎంపీపీ తుమ్మల ఫర్వీన్‌షామీర్ తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్ర అంత్యక్రియలలో ప్రబోధానంద భక్తులు


అంత్యక్రియల్లో పాల్గొన్న త్రైతసిద్ధాంత ప్రబోధానంద భక్తులు

కొత్తచెరువు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కమ్మపాళ్యానికి చెందిన అప్పకొండప్పగారి నాగేంద్ర గుండెపోటుతో సోమవారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన త్రైత సిద్ధాంత ప్రబోధాసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక కొత్తచెరువు మండలకమిటీ అధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న ప్రబోధానంద భక్తులు వేలసంఖ్యలో తరలి వచ్చారు. వారి సంప్రదాయం ప్రకారం మంగళవారం అంత్యక్రియలను నిర్వహించారు. ఆయన మృతి ప్రబోధానంద సేవా సమితికి తీరనిలోటని వారు పేర్కొన్నారు.

వేదమాత గాయత్రి


ధర్మవరంలో గౌరీదేవిగా లక్ష్మీనగర్ చౌడేశ్వరి


సాలేవీధిలో గాయత్రీదేవిగా పెద్దమ్మ


పద్మావతిదేవి గాంధీనగర్ చౌడేశ్వరి

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాల్లో రెండో రోజు మంగళవారం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మూల విరాట్లను పంచామృతములతో అభిషేకించారు. పట్టువస్త్రాలతో అలంకరించారు. ఆయా ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.


కదిరిలో అన్నపూర్ణగా చౌడేశ్వరి


కదిరిలో మహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి


అలంకరణలో ఉప్పునేసినపల్లి కొల్హాపురమ్మ


ముదిగుబ్బలో గాయత్రీదేవిగా వాసవీ మాత


కొత్తచెరువులో గాయత్రీదేవిగా పెద్దమ్మ

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నల్లమాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్యసమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ సునీతాబాయి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తమ శాఖల ప్రగతి నివేదికలు వివరించారు. ఏఓ అబ్దుల్‌హక్ మాట్లాడుతూ... ప్రస్తు తం పంటలు సాగుచేసిన రైతులు ఈ-క్రాప్ బుకింగ్ చేయించు కోవాలని తెలిపారు. లేకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు వర్తిం చవన్నారు. యూరియాను రైతు సేవా కేంద్రాల్లో అందిస్తున్నామన్నారు. అవసరమున్న రైతులు టోకన్ పద్ధతిలో యూరియా తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి అరకొరగా ఉందని ప్రజాప్రతినిధులు తెలుపగా, వాటిని పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. అలాగే విద్యుత్ అధికారులు మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో నూతనంగా విద్యుత్ లైన్లు వేస్తున్నామని, కావున గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరా యానికి ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ రంగనాయకులు, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏని పునరుద్ధరించాలి

● ఆర్డీఓకు అంబేడ్కర్ సేవాసమితి వినతి

కదిరి అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏని పునరుద్ధరించాలని అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ వీవీఎస్‌శర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సమితి సభులు మాట్లాడుతూ... ఆర్డీటీ పేదలకు అందిస్తున్న సేవలను గుర్తించి, సంస్థకు వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏని పునరద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వేణుగోపాల్, దిల్‌షాద్, విజయ్‌కుమార్, నసీమా, నాగరాజు, మస్తాన్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను అమ్ముకోవద్దు : ఏడీఏ


పడమర నడింపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సనావుల్లా

నంబులపూలకుంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులను పక్కరాష్ట్రాలకు విక్రయించకుండా, పొలాలకు వినియోగించుకోవాలని రైతులకు ఏడీఏ సనావుల్లా సూచించారు. మండలపరిధిలోని వెలిచెలమల, పడమర నడింపల్లిల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ మాట్లాడుతూ... సేంద్రియ ఎరువకులతో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంటలు పండించవచ్చని తెలిపారు. ఏఓలు లోకేశ్వర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఏఈఓ శిరీష, సిబ్బంది రాధ, నారాయణస్వామి రైతులు పాల్గొన్నారు.

● నల్లమాడ: మండలంలోని అరవవాండ్లపల్లి తండాలో మంగళవారం వ్యవసాయ విస్తరణాధికారి రంగచారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలకు సేంద్రియ ఎరువులు వాడితే కలిగే లాభాలు, రసాయనిక ఎరువుల వల్ల నష్టాలను ఆయన వివరించారు. ఏఈఓలు, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

● తనకల్లు : మండలంలోని గంగసానిపల్లిలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అలాగే నానో యూరియా వాడాలని సూచించారు. వ్యవసాయాధికారి భారతి, ఐసీఆర్‌టీ శంకర్‌రెడ్డి, వేదవతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలనలో పారదర్శకత అవసరం

●డీడీఓ జనార్దన్‌రావు


మాట్లాడుతున్న డీడీఓ జనార్దన్‌రావు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని డీడీఓ జనార్దన్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి సూచిక 2.0వర్క్‌షాపు నిర్వహించారు. డీడీఓ హాజరై మాట్లాడారు. పంచాయితీల పనితీరును మెరుగుపరచడం, పారదర్శకత, సమగ్ర అభివృద్ధి సూచీలపై చర్చించారు. అనంతరం ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిమనోహర్, డిప్యూటీ ఎంపీడీఓ ఏలూరి వెంకటేష్, సర్పంచ్‌లు ఆనంద్‌రెడ్డి, ముత్యాలప్పనాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నెహ్రూ నగర్‌లో డీపీఓ పర్యటన

కొత్తచెరువు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి సమత మంగళ వారం మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌లో ఆకస్మికంగా పర్యటించారు. వర్షాకాలంలో చెత్తను రోడ్లపై వేయవద్దన్నారు. డస్ట్‌బిన్‌లలో ఉంచుకుని, చెత్త సేకరణ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో వేయాలని ఆమె ప్రజలకు సూచించారు. గ్రామ పంచాయితీల అభివృ ద్ధికి ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి

● ఏఐవైఎఫ్ నాయకుల డిమాండ్


ఆర్డీఓ సువర్ణకు వినత పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని, ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్, జిల్లా కార్యదర్శి సకలరాజా అధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వశాఖల్లో ఖాళీ గా ఉన్న వేలాది పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యలపై కాబినెట్ సబ్‌కమిటీ వేసి ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆర్డీఓ సువర్ణకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కమల్‌బాషా, ప్రవీణ్‌ఫైరోజ్, జీలాన్‌ఖాన్, గోవర్ధన్, ఇమ్రాన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో
నిత్యం అంతరాయం

● పట్టించుకోని విద్యుత్ అధికారులు: గాండ్లపెంట వాసులు

గాండ్లపెంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని, ఆ శాఖ అధికారు లు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. గృహాలకు అందిస్తున్న విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం ఏర్పడు తోందని వాపోతున్నారు. రాత్రింబవళ్లు పలుమార్లు విద్యుత్ పోతూ వస్తోందంటున్నారు. రాత్రి సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఉక్కపోత, దోమలతో ఇబ్బందులు పడుతున్నా మని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రధానంగా గాండ్లపెంట ప్రధాన రహదారిలో పచ్చని చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతోనే తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్థులు అంటున్నారు. మండలకేంద్రంలోని కదిరి-గాండ్లపెంట రహదారిలోని విద్యుత్ తీగలకు పచ్చని కొమ్మలు తగులుతున్నాయన్నారు.


గాండ్లపెంట ప్రధాన రహదారిలో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు

అధికారులు మాత్రం మండల కేంద్రంలోని సమస్యలు గుర్తిం చకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇలాంటి సమస్యపై దృష్టి సారించి, విద్యుత్ సరఫరాలో అంతరాయం అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా ఉండాలి

● రాజకీయ నాయకులు సహకరించాలి: ఆర్డీఓ


రాజకీయపార్టీల నాయకులతో సమావేశమైన ఆర్డీఓ మహేశ్

ధర్మవరం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తప్పులతడకలు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయడానికి అధికారులకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆర్డీఓ మహేశ్ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా సవరణపై ఆర్డీఓ సమీక్షించారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడు తప్పక ఓటరుగా నమోదు కావాలని, బోగస్ పేర్లు లేకుండా జాబితాను శుద్ధి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు, వెనుకబడిన వర్గాలు ఓటరుజాబితాలో తప్పక నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు.

పకడ్బందీగా తనిఖీలు చేయండి

బత్తలపల్లి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలించకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని ఆర్డీఓ మహేష్ స్థానిక అధికారులకు సూచించారు. అక్రమంగా ఇసుక తరలించకుండా మండలపరిధిలోని జ్వాలాపురం వద్ద రెవెన్యూ అధికారులు చెక్‌పోస్ట్ పోస్ట్ ఏర్పటు చేశారు. ఈ చెక్‌పోస్టును మంగళవారం ఆర్డీఓ మహేష్ తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ స్వర్ణలత, వీఆర్‌ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారానికి నైపుణ్యం అవసరం

● మంగళకర విద్యాసంస్థల కరస్పాండెంట్


జగరాజుపల్లి మంగళకర కళాశాలలో ఏర్పాటుచేసిన స్టాళ్లు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యాపార కార్యకలాపా ల్లో రాణించాలంటే నైపుణ్యం ఎంతో అవసరమని స్థానిక మంగళకర విద్యా సంస్థల కరస్పాండెంట్, మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర డిగ్రీ కళాశాలలో మంగళవారం బీబీఏ విద్యార్థులకు వ్యాపారం నిర్వహణ, మెలకువలపై అవగాహన కార్యక్రమం ఏర్పా టుచేశారు. ఇందులో బాగంగా వివిధ రకాల ఫుడ్‌స్టాళ్లను ఏర్పాటుచేసి వినియోగదారులను ఆకర్షించడం, వినియోగదారులను ఎలా కన్విన్స్ చేయాలనే విషయాలపై మెలకువల గురించి విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించారు. కార్యక్రమంలో మంగళకర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, మంగళకర విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్


ప్రశాంతిగ్రాంలో మొక్కను నాటుతున్న మున్సిపల్ కమిషనర్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకవిలువలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలని సీడీపీఓ జయంతి, మునిసిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రశాంతిగ్రాంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'పోషణ పక్వాడా, బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ... జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. స్థానికంగా ప్రకృతి సిద్ధంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, ధాన్యాలు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. సీడీపీఓ మాట్లాడుతూ సమతుల ఆహారం శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తుందని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి తులసి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యంపై అవగాహన

నల్లమాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులందరూ ఉన్నారని, వ్యాధిగ్రస్థులందరూ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ఇక్కడే చికిత్సలు చేయించుకోవాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ మధుసూదన్ సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మధుసూదన్ హాజరై మాట్లాడారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసి మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కేశవరెడ్డి, నాగభూషణం నాయుడు, వైద్యులు అత్తరున్నీసా, నందిని తదితరులు పాల్గొన్నారు.

● నల్లచెరువు/ నంబులపూలకుంట: నల్లచెరువు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో మంగళవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం వైద్యాధికారి అలేఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మం డల కేంద్రమైన నంబులపూలకుంట ప్రభుత్వ ఆస్పత్రి లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్నినిర్వహించారు. ప్రత్యేక డాక్టర్ రమేష్‌నాయక్ రోగులకు చికిత్సలు చేశారు.

26న అప్రాచెరువులో వైద్యశిబిరం

బత్తలపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్రా చెరువు గ్రామంలో ఈ నెల 26న ఏపీ సాంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సేవాసమితి ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, వైట్‌ఫీల్డ్ వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో ప్రముఖ వైద్యనిపుణులు వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. వివరాలకు 7998256789, 9535197749 నంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన పెంచండి

● డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం

చిలమత్తూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించి మహిళల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె డాక్టర్ లావణ్యతో స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌పై ఆరా తీశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించి మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో జరుగుతున్న సుఖప్రసవాలపై అడిగి తెలుసుకున్నారు. నెలకు ఎన్ని జరుగుతున్నాయి? ఏవైనా సమస్యలు వస్తున్నాయా? అని ఆరా తీశారు. కాన్పుల గదిని, కాన్పుల నమోదు రిజిస్టర్‌ని పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విష జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ రోజ, సీహెచ్ఓ జయచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి వుండాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. కల్లుమర్రి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం బుళ్లసముద్రం గ్రామంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు ఆర్థికంగా ఉండగలవన్నారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వినోద్‌కుమార్, లిఖిత, సీడీపీఓ నాగమల్లేశ్వరీ, మండల కన్వీనర్ నాగరాజు, మాజీ సర్పంచ్ జైపాల్, రవీంద్రారెడ్డి, బీజేపీ నాయకులు పురుషోత్తం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాయల్టీ ఉపసంహరించుకోవాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట వడ్డెర్ల నిరసన



నిరసనలో పాల్గొన్న వడ్డెర్లు

గోరంట్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాయల్టీని ఉపసంహరించుకోవాలని మండలంలోని కమ్మలవాండ్లపల్లి తదితర గ్రామాలకు చెందిన వడ్డెర్లు.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గతంలో ఎలాంటి రాయల్టీ విధించలేదని, అయితే ప్రస్తుతం క్యూబిక్ మీటర్‌కు రూ.280 విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము రోజంతా పనిచేస్తే రూ.8వందల నుంచి రూ. వెయ్యి వస్తుందనీ, ట్రాక్టర్‌కు రాయల్టీ విధిస్తే ఎలా జీవించాలని ప్రశ్నించారు. వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. వడ్డెర్లు అధిక సంఖ్యలో ట్రక్టర్లలో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి బైఠాయించి ఆందోళన నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు.

విజయవంతం చేయండి: యూటీఎఫ్

పెనుకొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్థిక విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే భారీ బహిరంగసభకు ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో రణభేరి బహిరంగసభకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ వర్తింపజేయాలని, బకాయిపడ్డ నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమేష్, గంగాధర్, రవీంద్రనాథ్, ఆది జినేష్, రామాంజినేయులు, గోవిందప్ప పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

అమరాపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ భవనంలో మంగళవారం ఎంపీడీఓ రామారావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. అన్ని గ్రామపంచాయతీల్లో పీ4 నిరుపేద కుటుంబాలైన వారిని ప్రభుత్వ అధికారులు మూడు నాలుగు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

గోరంట్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా గోరంట్ల మేజర్ పంచాయతీలోని అన్ని విభాగాలకు చెందిన 95 మంది సిబ్బందికి దుస్తులు, నిత్యావసర వస్తువులను మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచ్ సరోజ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కమలాబాయి, ఈఓ సుబ్రహ్మణ్యం, విద్యుత్, నీటి సరఫరా, శ్యానిటేషన్ తదితర విభాగాలకు చెందిన కార్మికులకు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు సాయిసంజయ్, నాయకులు బాలక్రిష్ణచౌదరి, లక్ష్మీనారాయణ, నాగేనాయక్, నిమ్మల విద్యాధరణీ, నిమ్మల శ్రీధర్, కక్కల రఘు, పచ్చ అశోక్, శీనా, అంజుము, నాగరాజు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

పరిష్కారానికి నోచుకోని సమస్యలు

పంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీ
ఇన్‌చార్జిని నియమించినా తప్పుకున్న వైనం
పారిశుధ్య కార్మికులకు అందని జీతాలు



ఖాళీగా దర్శనమిస్తున్న కార్యదర్శి కుర్చీ

పరిగి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయంలో సమస్యలు ఎక్కడికక్కడే ఉండిపోయాయి. పంచాయతీకి కార్యదర్శి లేకపోవడమే ఇందుకు కారణం. ఒక్క సమస్యలే కాకుండా పారిశుధ్య కార్మికులకు జీతాలు సైతం అందడంలేదు. పైడేటి కార్యదర్శిని ఇక్కడకు ఇన్‌చార్జిగా నియమించారు. నీటి, డ్రైనేజీ ఇలా పలు సమస్యలు ఉండటం, నిధుల కొరత నేపథ్యంలో తాను ఇక్కడ విధులు నిర్వర్తించలేనంటూ ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకుని వెళ్లిపోయారు. అప్పటి నుంచి సమస్యలు ఎక్కడకక్కడే ఉండిపోయాయి. దీంతో కార్మికులకు జీతాలు కూడా ఆగిపోయాయి. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్థానికులు అనుమతుల కోసం కార్యాలయానికి వెళితే కార్యదర్శిలేరని చెబుతుండటంతో వారు వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. వీరే కాదు అనేక సమస్యలు పరిష్కారం కావడంలేదు. పంచాయతీవ్యాప్తంగా 13 వేలకుపైగా జనాభా ఉంది. వివిధ సమస్యలు, పనుల నిమిత్తం కార్యదర్శి సంతకం అవసరముంటుంది. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఎప్పుడు కార్యాలయానికి వెళ్లినా ఖాళీ సీటు దర్శనం ఇస్తోందని వారు అంటున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలువురు అధికారులను సంప్రదించగా సచివాలయంలో నిధుల కొరత ఉందన్నారు. గతంలో పనిచేసిన కార్యదర్శులకు జీతాలు పెంచడంవల్ల నిధులు సరిపోవడంలేదని, ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు.

పారిశుధ్య కార్మికులకు అందని వేతనాలు

ఏడు నెలలుగా తమకు జీతాలు అందడంలేదని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపడుతున్నామని అంటున్నారు. పంచాయతీ వ్యాప్తంగా కాలువలు, చెత్తదిబ్బలు శుభ్రం చేస్తున్నామని చెబుతున్నారు. జీతంమీదే ఆధారపడి బతుకుతున్నామని, సమయానికి అందకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యలపై పెనుకొండలో ఉన్నతాధికారులకు కూడా వినతిని అందించామని, అయినా స్పందన లేదంటున్నారు.

జీతాలు ఇవ్వండి



పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలి. ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదు. జీతాలు అడిగితే కార్యదర్శి లేనందున ఇవ్వలేకపోతున్నామని అంటున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులకు తెలిపాం. వినతిపత్రాలు అందించాం. ఇప్పటికైనా కార్యదర్శిని నియమించి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలి. కార్మికులకు వేతనాలు అందేలా చూడాలి.

-లింగారెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు

త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారు



సచివాలయానికి సంబంధించి మూడు నెలల క్రితం కార్యదర్శి బదిలీపై హిందూపురం మండలం కిరికెర గ్రామానికి వెళ్లారు. అప్పటి నుంచి కార్యదర్శి నియామకం కాకపోవడంతో ఉన్నతాధికారులు తాత్కాలికంగా కార్యదర్శిని నియమించారు. నిధుల కొరత ఉందంటూ ఆయన తప్పుకున్నాడు. దీంతో సమస్య ఏర్పడింది. మునుపటి కార్యదర్శి నారాయణను కార్యదర్శిగా నియమించాం. ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారు.

-విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ

జగన్మాతా.. నమోస్తుతే..!

శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రెండోరోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి.



గోరంట్ల పట్టణంలో శ్రీవాసవీ మాతకు గాయత్రి దేవి అలంకరణ



సోమందేపల్లిలో పార్వతీదేవిగా దర్శనమిస్తున్న అంబాభవాని



హిందూపురంలో గజలక్ష్మిగా గాయత్రీమాత



పురంలో కొబ్బరి అలంకరణలో స్కందమాతగా జలదుర్గమ్మ



పురంలోని గాంధీ సర్కిల్‌లో దుర్గామాతకు అలంకరణ



కూర్మావతారంలో పేట వేంకటరమణుడు

పరిసరాలను శుభ్రంగా ఉంచండి

- మున్సిపల్ చైర్మన్ రమేష్



పాండురంగ నగర్‌లో శుభ్రం చేస్తున్న చైర్మన్, కమిషనర్

హిందూపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాండురంగ నగర్‌లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున చీపురు పట్టి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి ఇంటిచుట్టూ ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేసుకుంటే బాగుంటుందన్నారు. సింగిల్‌యూస్ ప్లాస్టిక్ బ్యాగులు, ప్లేట్లు, పేపర్లను వాడకూడదన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామన్నారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్ నాగేంద్రమ్మ, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, గంగాధరయ్యగుప్త, గోపాల్, మునిరాజ్, అశ్వర్థనారాయణ, నాగకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించండి: సీపీఎం

మడకశిర టౌన్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌడనహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలో కబ్జాకి గురైన ప్రభుత్వ భూములను రక్షించాలని సీపీఎం నాయకులు ఈరేష్, పలువురు విద్యార్థి సంఘ నాయకులతో జిల్లా రెవెన్యూ అధికారి సూర్యానారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించి సమస్యను పరిష్కారించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరూ ప్రభుత్వ భూములు, చెరువు ప్రాంతం, కుంటలు, బావులు, వంక తదితరాలను స్వాహా చేశారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ ఖాతాల్లోకి ఎక్కించుకొని బ్యాంకు రుణాలు సైతం పొందినట్లు తెలిపారు. వెంటనే జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. నాయకులు షాహిద్, మహేంద్రా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గార్మెంట్స్ పరిశ్రమను పరిశీలించిన కలెక్టర్



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గోరంట్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతపల్లి వద్ద ఉన్న టెక్స్‌పోర్టు ఓవర్‌సీస్ గార్మెంట్స్ తయారీ పరిశ్రమను కలెక్టర్ ఏ. శ్యామ్‌ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. పరిశ్రమలోని అన్నివిభాగాలను పరిశీలించారు. యజమాన్యం ద్వారా తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడారు. వసతి సదుపాయాలపై ఆరా తీశారు. గార్మెంట్స్ పరిశ్రమ ద్వారా 15 వందల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, గార్మెంట్స్ హెచ్‌ఆర్ మేనేజర్ మహదేవ్ గౌడ్, ప్లాంటు మేనేజర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుజిరీ దుకాణంలో అగ్ని ప్రమాదం

హిందూపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని టీచర్స్‌కాలనీలో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక యంత్రం అక్కడకు చేరుకుని మంటలు ఆర్పారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా లేదా ఇతర కారణాలు తెలియాల్సి ఉందని అగ్నిమాపక అధికారి ప్రభాకర్ తెలిపారు. నష్టం వివరాలు అంచనా వేయాల్సి ఉంది.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

హిందూపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో నివాసమున్న ఇందిరాగుప్త కొద్దిరోజుల క్రితం రైల్వే స్టేషన్‌లో జరిగిన ప్రమాదానికి గురై మృతిచెందాడు. ఈయన తెలుగుదేశం పార్టీ సభ్యత్వం చేయించుకున్నాడు. దీంతో ఇతనికి పార్టీ తరుపున రూ.5లక్షలు చెక్కును పంపించారు. మంగళవారం టీడీపీ పట్టణాధ్యక్షులు వెంకటేశ్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, కౌన్సిలర్ రఘు మృతుడి భార్య సీతాలక్ష్మికి చెక్కును అందించారు.

గురువులకు సన్మానం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరిపాళ్యం గ్రామ ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 12 కుర్చీలు, మైక్‌ను వితరణ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆంజనేయులు, అగ్రికల్చర్, మార్కెట్ యార్డ్ కార్యదర్శిగా పనిచేసిన ఆనంద్, బెస్ట్ టీచర్స్‌గా అవార్డు పొందిన లింగమూర్తి, డీకే అరుణ, పీడీ ఆదినారాయణను, డీఎస్సీలో ఉద్యోగం పొందిన రూపాదేవి, బోయ మారుతిని వారు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, శ్రీనివాసులు, అశ్వర్థనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే పీఏ వీరయ్య



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్, ఎమ్మెల్యే పీఏ

చిలమత్తూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పీఏ వీరయ్య, తహసీల్దార్ వెంకటేశులు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక రెవెన్యూ సదస్సుని నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలను వినతుల ద్వారా అందజేశారు. ప్రధానంగా పట్టాదారు పుస్తకాలు, విభాగాలు, అన్‌సెటిల్డ్ భూములకు హక్కులు తదితర సమస్యలకు సంబంధించి వినతులు ఎక్కువగా వచ్చాయి. అనంతరం వారు సమస్యలను తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలుగా వర్గీకరణ చేస్తామన్నారు. ఆయా స్థాయిల్లో సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, శ్రీదేవి, అంజినప్ప, లక్ష్మీనారాయణయాదవ్, రంగారెడ్డి, తిప్పారెడ్డి, బాలాజీ, నందీషప్ప పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లను తొలగిస్తున్నాం

కమిషనర్ సతీష్‌కుమార్

పెనుకొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో అనధికారికంగా వేసిన లే అవుట్లను అధికారులు తొలగిస్తున్నట్లు కమిషనర్ సతీష్‌కుమార్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రభుత్వం అనధికార లే అవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవడానికి జీఓ 34 ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అయినప్పటికీ కొందరు క్రయవిక్రయాలు చేస్తున్నారని, అలాంటి అనధికార లే అవుట్లను గుర్తించడంతోపాటు వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనరాదని, అలా కొన్నవారికి నగర పంచాయతీ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరగదని స్పష్టం చేశారు. అనధికార లే అవుట్లు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాటిని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. మంగళవారం జాతీయరహదారి పక్కన సర్వేనంబరు 303, 304, 331లలో రెండెకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ అనుమతులు పొందకుండా వేసిన లే అవుట్‌ను నగర పంచాయతీ అధికారులు తొలగించడం జరిగిందన్నారు.

'మోతాదు మేరకే మందులు వినియోగించాలి'

గోరంట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరులో ఉత్తమ వ్యవసాయ యజమాన్య పద్ధతులతో అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. 30 మంది రైతుల పొలాలను, వాటి రికార్డులను ఎవ్యాల్యూటర్ వెంకటేశ్ పరిశీలించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులను సిఫార్సు మేరకు వాడాలని రైతులకు సూచించారు. అధిక మోతాదులో వాడితే పంట ఉత్పత్తుల్లో వాటి అవశేషాల వల్ల మానవ ఆహారంపై ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ శంకర్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

అమరాపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కెంకెర గ్రామంలో మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వెటర్నరి అసిస్టెంట్ శ్రీధర్, టీడీపీ నాయకులు తిప్పేస్వామి, మాజీ డీలర్లు ప్రభాకర్ గుంగప్ప, పాండురంగప్ప, హనుమంతరాయ పంపిణీ చేశారు.

యూరియా పంపిణీ

అమరాపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తమ్మడేపల్లి రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి మంజునాథ్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రానికి 12.6 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ వచ్చిందన్నారు. రైతులకు 18 బ్యాగుల యూరియా, వంద బ్యాగుల డీఏపీని పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన యూరియా పంపిణీ చేస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు మోహన్, సఫియా, మహాలక్ష్మీ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

రొద్దం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా ఆనంద్‌ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శులు బాబు, జనార్దన్, టెక్నికల్ అసిస్టెంట్‌లు నూతన డిప్యూటీ ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హిందూపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తుండగా ఎక్సైజ్ పోలీసులు దాడులుచేసి ఇరువురిపై కేసు నమోదుచేసినట్లు సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. సంతేబిదునూ క్రాస్, కిరికెర క్రాస్‌వద్ద మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి మద్యాన్ని తీసుకొస్తుండగా ఇరువురిని అరెస్ట్‌చేసి వారి నుంచి 192ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ర్యాలీకి అనుమతి ఇవ్వండి

● డీఎస్పీని కోరిన జనసేన నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ నటించిన ఓజీ సినిమా విడుదల సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని, అనుమతి ఇవ్వాలని జనసేన పార్టీ నాయకులు డీఎస్పీ మహేష్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం డీఎస్పీని కలిసిన జనసేన నాయకులు మాట్లాడుతూ గురువారం ఓజీ సినిమా విడుదల అవుతున్న సందర్భంగా బుధవారం సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి అమ్మత్‌మహల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.



వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు